


2 స్టాప్ బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డీఎం పరిమళ

## హైదరాబాద్‌కు 2 స్టాప్ బస్సు

తొర్రూరు, అక్టోబర్ 3 : తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు 2 స్టాప్ బస్సును మంగళవారం డిపో మేనేజర్ పరిమళ ప్రారంభించారు. తొర్రూరు నుంచి తిరుమలగిరి, జనగాం బైపాస్ మీదుగా హైదరాబాద్ ఉప్పల్ వరకు సర్వీస్ నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉప్పల్ వరకు కేవలం 2 గంటల 40 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఉదయం 3. 20, 9.30 గంటలు, సాయంత్రం 4.40 గంటలకు తొర్రూరు నుంచి బయలుదేరి వెళ్తాయని చెప్పారు. ఉప్పల్ నుంచి తొర్రూరుకు ఉదయం 4 గంటలకు, 7.10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, 4.50గంటలకు బస్సు బయలు దేరి వస్తుందన్నారు. తొర్రూరు, తిరుమలగిరి, దేవరుప్పుల మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఎమ్మెల్సీ శ్రీహరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కూనూరు నాయకులు

## ఎమ్మెల్సీ శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేత

జఫర్‌గఢ్, అక్టోబర్ 3: మండలంలోని కూనూరు బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండలోని శ్రీహరి నివాసంలో పార్టీ మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కూనూరు గ్రామంలో మహిళలు, యువత సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించు కుంటామని వారు తెలిపారు. అందుకు స్పందించిన కడియం మాట్లాడుతూ.. జఫర్‌గఢ్ మండలంలోని కూనూరు గ్రామం అంటే తనకు ఎనలేని అభిమానమన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, సర్పంచ్ ఇల్లందుల కుమార్, జిల్లా నాయకుడు ఇల్లందుల శ్రీనివాస్, నాయకులు సంపత్, రాజు, కుమార్, సంపత్, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఖాయం.. మెజార్టీయే లక్ష్యం

లింగాలఘనపురం, అక్టోబర్ 3: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి గెలుపు ఖాయమని మెజార్టీయే లక్ష్యమని జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం కడియం శ్రీహరి పర్యటించనున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో జడ్పీటీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు బాటలు వేస్తున్నాయన్నారు. సమావేశాల్లో పార్టీ జిల్లా నాయకుడు ఉపేందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, గవ్వల మల్లేశం, విండో అధ్యక్షుడు బుషిగంపల ఉపేందర్, మల్ల శ్రీశైలం, నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, చౌదరపెల్లి శేఖర్, దుంబాల భాస్కర్‌రెడ్డి, కేమిడి యాదగిరి, బుషిగంపల ఆంజనేయులు, ఎడ్ల రాజు, ఎండీ జానీమియా, లింగాల వెంకటేష్, బోయిని జంపన్న, బెజ్జం చంద్రయ్య, యాకూబ్, సర్పంచులు పాల్గొన్నారు.

## 'తండా బాట'ను విజయవంతం చేయాలి

దేవరుప్పుల, అక్టోబర్ 3: ఈనెల 9న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేపట్టనున్న రెండో విడుత 'తండా బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పెదతండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల నాయకుడు పల్లా సుందర రాంరెడ్డి మాట్లాడారు. సోమవారం మండలంలోని పలు తండాల్లో మంత్రి పర్యటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి పనుల ప్రారంభం, మంజూరైన పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి పర్యటనలో తండావాసులు మంత్రిని నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఉంటుందని, ఈ తండాబాటను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, అధికార ప్రతినిధి, సుడిగెల హనుమంతు, మాజీ ఎంపీపీ కే సోమయ్య, ఎంపీటీసీ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓటర్ల జాబితా

- ఓటర్ల జాబితా అబ్జర్వర్ బాల మాయాదేవి
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, అక్టోబర్ 3 : జిల్లాలో కలెక్టర్ శశాంక నేతృత్వంలో చేపట్టిన ఓటర్ల జాబితాపై ఎన్నికల అబ్జర్వర్ బాల మాయాదేవి సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పరిశీలకురాలు బాల మాయాదేవి, కలెక్టర్ అధ్యక్షతన ఎన్నికల అధికారులు పీపీటీని ప్రెజెంట్ చేశారు. ఈ నెల 4న ఓటర్ల జాబితాను పబ్లిష్ చేయనున్నందున జాబితా రూపకల్పనను కలెక్టర్ ఓటర్ల జాబితా పరిశీలకురాలికి వివరించారు. 2018లో 4,12,896 ఓటర్లు నమోదు కాగా, 4,59,919 ఓటర్లు నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే 80 సంవత్సరాల పైబడిన వాళ్లు 6,544 ఓటర్లకు 1.43 శాతంగా నమోదైనట్లు తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులు 1,14,968 ఉండగా 25,450 పంపిణీ చేశామన్నారు. 93 వేల కార్డుల్లో 47 వేలు ప్రింట్ అయినట్లు వివరించారు. మిగతావి ఒక వారంలో ప్రింట్ కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 773 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. అందులో డోర్నకల్‌లో 256, మహబూబాబాద్‌లో 283 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. మిగతా మూడు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో ఉన్నట్లు తెలిపారు. స్వీప్ కార్యక్రమాలను చేపట్టి యువత ఓటర్ల నమోదును 4,489 నుంచి 15 వేల 803 ఓటర్లకు పెంచామన్నారు. ఈ సందర్భంగా బాలమాయాదేవి ఎన్నికల అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు, ఎలక్షన్ విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాపై సమీక్షిస్తున్న అబ్జర్వర్ బాల మాయాదేవి, కలెక్టర్ శశాంక

### మా భూముల్లో
# టోల్‌ప్లాజా నిర్మించవద్దు

- నిరసన వ్యక్తం చేసిన రైతులు

నెల్లికుదురు, అక్టోబర్ 3 : నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా తమ భూముల్లో టోల్ ప్లాజా నిర్మించ వద్దంటూ రైతులు మంగళవారం రోడ్డెక్కిన ఘటన మండలంలోని వావిలాలలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వలిగొండ నుంచి భద్రాద్రి కొత్తగూడ వరకు నేషనల్ హైవే నిర్మాణం కోసం సర్వే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వావిలాల శివారులో టోల్ ప్లాజా నిర్మాణం కోసం హైవే అధికారులు పంట పొలాల్లో చేస్తున్న సర్వేను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల్లో నిర్మాణం చేపడితే తాము రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ టోల్ ప్లాజా నిర్మాణం చేపడితే ఆత్మహత్య చేసుకుంటామని రైతులు పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ భూముల్లో కాకుండా ప్రభుత్వ భూముల్లో టోల్ ప్లాజా నిర్మాణం చేపట్టాలని కోరారు. నిరసనలో అంజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, సూరయ్య, శ్రీను, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రోడ్డుపై పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



నిందితులను చూపుతున్న ఎస్సై సతీశ్

## పేకాట స్థావరాలపై దాడులు

- ఏడుగురిపై కేసు నమోదు
- రూ. 10,500 నగదు స్వాధీనం

నర్సింహులపేట, సెప్టెంబర్ 3 : పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు వద్ద ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల గడ్డం శ్రీను, రేఖ అనిల్, మల్లం జగన్, నీలికుర్తి వెంకటరెడ్డి, గడ్డం వెంకన్న, వడ్డేపల్లి మలికార్జున్, బంద వీరన్నలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నేడు బయ్యారంలో బతుకమ్మ చీరెల పంపిణీ

బయ్యారం, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు బతుకమ్మ చీరెలు, కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

# మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- ఈ నెల 5న అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ
- చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నారాణి

మహబూబాబాద్, అక్టోబర్ 3 : మహబూబాబాద్ మున్సిపాలిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ కటంగూరి ప్రసన్నారాణి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రం శివారులో నిర్మిస్తున్న మున్సిపాలిటీ భవనాన్ని, కోర్టు సెంటర్‌లో ప్రారంభించనున్న అంబేద్కర్ కాంస్య విగ్రహ నిర్మాణ పనులను చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నారాణి, అంబేద్కర్ కమిటీ సభ్యులు, మున్సిపాలిటీ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీ భవన నిర్మాణంలో వేగం పెంచాలని ఆదేశించారు. మున్సిపాలిటీ నిర్మాణ పనులు పూర్తయితే పాలక వర్గం, అధికారులు చాంబర్లలోకి మారనున్నట్లు తెలిపారు. అదే విధంగా కోర్టు సెంటర్‌లో చేపడుతున్న అంబేద్కర్ విగ్రహం నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 5న అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఉపేందర్, బోనగిరి గంగాధర్, టీపీవో నవీన్‌కుమార్, కాంట్రాక్టర్లు, అంబేద్కర్ కమిటీ బాధ్యులు కామ సంజీవరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అధికారులు